సాక్షి
కుమురం భీం
సోమవారం : 24 ఏప్రిల్ : 2023



ఒకే క్షేత్రం.. పంటలు అనేకం
చెన్నూర్‌కు చెందిన రైతు మధు లంబడిపల్లిలో ఏడెకరాల్లో తీరొక్క పంటలు సాగు చేస్తున్నాడు. అధిక దిగుబడి సాధిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. 8లో▸



సాగు.. బాగు! 9లో▸
పెంచికల్‌పేట్ మండలం లోడుపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేస్తున్నారు. స్వయంగా విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

గరిష్టం/కనిష్టం
35.0/24.0
వాతావరణం
పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వాన పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్: కంటివెలుగులో పని చేస్తున్న అప్తోమ్స్‌ను పూర్తి స్థాయిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర అప్తాల్మిక్ అసిస్టెంట్, అప్తోమెట్రిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ ఓ ప్రకటనలో కోరారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కంటివెలుగు మొదటిదశలో ఆరు నుంచి ఎనిమిది నెలలు మాత్రమే తమను వినియోగించుకున్నారని, అనంతరం పట్టించుకోలేదని పేర్కొన్నారు. రెండోదశలోనూ రాష్ట్ర వ్యాప్తంగా 1,500 మంది విధులు నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వం దినపత్రికల్లో ఇచ్చిన ప్రకటనలతో తాము వివిధ ఆస్పత్రుల్లో పని చేస్తున్న ఉద్యోగాలు వదులుకొని కంటి వెలుగులో పని చేసినట్లు పేర్కొన్నారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

నూతన కార్యవర్గం



అగ్రి ఎంప్లాయిస్ నూతన కార్యవర్గం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో వివిధ సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్, వ్యవసాయ సంబంధిత అగ్రి ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కవ్వాల మహేందర్, ఉపాధ్యక్షుడిగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, సహాయ కార్యదర్శిగా బట్టుపల్లి సంతోష్, కోశాధికారిగా లొనారే రాజేందర్, సభ్యులుగా జాడి రాజేశ్, అరీఫ్‌ఖాన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఉప్రే కిరణ్, మేకల సంతోష్, వివిధ మండలాల అగ్రి ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

అఖండం.. హరినామం



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాబృందం సభ్యులు

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్‌లో అఖండ హరినామ సంకీర్తన యజ్ఞం ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఇందులో భాగంగా కళాబృందాలతో 72గంటల పాటు నిరంతర హరినామ సంకీర్తన గీతాలు ఆలపిస్తారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరుకాగా, గ్రామంలో హరినామ సంకీర్తన మార్మోగింది. మంగళవారం రాత్రి 11గంటల వరకు మహాప్రసాద వితరణ నిర్వహిస్తామని నిర్వాహక కమిటీ తెలిపింది. బుధవారం ఉదయం 6గంటలకు నగర్ కీర్తన దదిమంగళ్ కార్యక్రమాలతో కార్యక్రమాలు ముగించనున్నట్లు పేర్కొంది.

'ఆదివాసీ హక్కులను కాలరాస్తున్న కేంద్రం'

దహెగాం: ఆదివాసీల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని తెలంగాణ ఆదివాసీల గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి తొడసం భీంరావు ఆరోపించారు. ఆదివారం టీఏజీఎస్ మండల మహాసభ సంఘం మండలాధ్యక్షుడు దిగిడె బక్కన్న అధ్యక్షతన నిర్వహించగా భీంరావు హాజరై మాట్లాడారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆదివాసీలను అడవి నుంచి వెళ్లగొట్టడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. 2006లో అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కుతూ అటవీ పరిరక్షణ నియమాలు తీసుకువచ్చిందని చెప్పారు. దీంట్లో అడవిని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేలా ఒక్క పేరా పెట్టిందని తెలిపారు. దీంతో ఆదివాసీలకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఏజెన్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చే జీవోను సుప్రీంకోర్టు ద్వారా రద్దు చేయించిందని విమర్శించారు. ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. 1/70, పేసా చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులపై అటవీ అధికారులు అక్రమ కేసులు పెట్టడాన్ని మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యురాలు దూల లక్ష్మి, మండల కార్యదర్శి నెర్పెల్లి అశోక్, ఉపాధ్యక్షుడు సిడాం శంకర్, నాయకులు శాగం కమల, పోతరాజుల తార, నైతం అంజన్న, కిష్టయ్య, సాంబయ్య, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.



కోర్సిని తాత్సారం..!

- 'ఎత్తిపోతల' కోసం ఎదురుచూపు
- ఏళ్లు గడిచినా పూర్తి కాని పనులు
- నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం!
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సాగునీటి కోసం రైతుల నిరీక్షణ



వృథాగా పడి ఉన్న పైపులు

చింతలమానెపల్లి: రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నామనే ప్రభుత్వాల మాటలు నీటిమూటలవుతున్నాయి. రైతు సంక్షేమ పథకాలకు రూ.కోట్లు కేటాయిస్తున్నా అధికారుల పర్యవేక్షణ లేక వాటి ద్వారా రైతులకు లబ్ధి చేకూరడంలేదు. చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామం వద్ద ప్రాణహిత నదిపై కోర్సిని ఎత్తిపోతల పథకం నిర్మాణం 2014లో ప్రారంభించారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ నాసిరకంగా.. నత్తనడకన కొనసాగుతున్నాయి. నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో రూ.36కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం కోర్సిని ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. నిర్మాణం పూర్తయితే కోర్సిని సమీప గంగాపూర్, రవీంద్రనగర్, బాబాపూర్, బాలాజీలనుకోడ గ్రామాల్లోని బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి.

అటవీ అనుమతులు లేక..
ఎత్తిపోతల పథకం పరిధిలోని బూరెపల్లి, గంగాపూర్, లంబాడిహేటి తదితర గ్రామాల పరిధిలోని బీడు భూములకు పైపులైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాగా, ఈ పైపులైన్ నిర్మాణం అటవీప్రాంతం నుంచి వేయాల్సి ఉండగా అటవీశాఖ నుంచి అనుమతులు లభించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగానే పనులు నిలిచిపోయాయని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఎప్పటికీ పూర్తయ్యేనో?
ప్రభుత్వ ఒప్పందం ప్రకారం కోర్సిని ఎత్తిపోతల పథకం నిర్మాణం ప్రారంభించిన 2014నుంచి 2016లోపు పూర్తి కావాల్సి ఉండగా నేటికీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నిర్మాణంలో భాగంగా పైపులైన్, జాక్‌వెల్, ఇంటెక్‌వెల్, ఇంటెక్ పైపులైన్, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించాల్సి ఉంది. వీటితో పాటు బీడు భూములకు సాగు నీటిని అందించేందుకు పైపులైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు జాక్‌వెల్, ఇంటెక్‌వెల్ నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, నది నుంచి జాక్‌వెల్‌కు నీటి సరఫరా చేయాల్సిన ఇంటెక్ పైపులైన్ పూర్తయింది. ప్రధాన ప్రెజర్ పైపులైన్ కూడా పూర్తి అవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల ప్రధాన పైపులైన్ వేయాల్సి ఉండగా ఇంకా పలుచోట్ల పూర్తి కాలేదు.

పనుల్లో నాణ్యత లోపం..
పథకం నిర్మాణంలో అడుగడుగునా నాణ్యత లోపాలున్నాయనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు తిలోదకాలిస్తూ స్థానికంగా ఉన్న నాసిరకమైన ఇసుకనే వినియోగించారు. విద్యుత్‌సబ్‌స్టేషన్ కోసం నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ యార్డులో కాంక్రీట్ గద్దె నిర్మాణంలో నాణ్యత పాటించలేదు. దీంతో ఇది ఆరంభంలోనే పగుళ్లు తేలింది. ఇప్పటికే పూర్తయిన పనులను ఇటీవల అధికారులు తనిఖీ చేయగా, లోపాలు బయటపడినట్లు సమాచారం. లీకేజీలు, నాసిరకం నిర్మాణాలతో పనులు పూర్తి చేయడంలో మరింత జాప్యం జరిగినట్లు తెలుస్తోంది.

పైపులైన్ లీకేజీలపై నివేదిక
కోర్సిని ఎత్తిపోతల పథకం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నట్లు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎత్తిపోతల పథకం నిర్వహణకు సంబంధించిన పరికరాలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ఇటీవల తనిఖీలు చేశారు. మోటర్లను ప్రారంభించి పనితీరును పరిశీలించారు. నాణ్యత లోపాలతో లీకేజీలున్నట్లు నివేదిక తయారు చేశారు. పూర్తయిన పనులకు సంబంధించి లోపాలను సరిచేయాలని వారు సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు సమాచారం.

చర్యలు చేపట్టాం
కోర్సిని ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు చేపట్టాం. అటవీశాఖ అనుమతులు రావడంలో ఆలస్యం కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. వ్యవసాయ భూముల్లో పంటల కారణంగా పైపులైన్ నిర్మాణాలను అటవీ ప్రాంతం నుంచి కాకుండా ప్రత్యామ్నాయంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలోపు పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం.
– భానుమూర్తి, చిన్న నీటిపారుదలశాఖ అధికారి

గడువు దాటి ఎనిమిదేళ్లయినా..
ఒప్పందం ప్రకారం 2016లోనే పథకం పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ.. ఒప్పంద గడువు దాటి ఎనిమిదేళ్లు గడుస్తున్నా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో సాగునీరు ఎప్పుడు అందుతుందోనని రైతులు నిరీక్షిస్తున్నారు. కీలకమైన ట్రాన్స్‌ఫార్మర్ యార్డు, పైపులైన్ నిర్మాణాల్లో నాణ్యత లోపించిందని రైతులు ఆరోపిస్తున్నారు. భవిష్యత్‌లో ఎత్తిపోతల పథకం ద్వారా నీరందుతుందా? అని సందేహం వ్యక్తంజేస్తున్నారు. పనులు నాణ్యతతో, వేగవంతంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

జిల్లాలో అకాల వర్ష బీభత్సం



దహెగాం: మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై విరిగిపడ్డ చెట్టు



కాగజ్‌నగర్ రూరల్: రహదారిపై కూలిన చెట్టు

ఆసిఫాబాద్/కెరమెరి/కౌటాల/పెంచికల్‌పేట్/దహెగాం/కాగజ్‌నగర్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లా కేంద్రంలో వడగండ్ల వాన కురిసింది. సాయంత్రం అరగంట ఈదురుగాలులతో వర్షం కురవగా వాతావరణం చల్లబడింది. కెరమెరి మండల కేంద్రంలో సాయంత్రం కురిసిన వడగళ్లవానకు జనజీవనం స్తంభించింది. వారసంత చెల్లాచెదురైంది. ప్రధాన రోడ్లు, డ్రైనేజీలు నిండుగా ప్రవహించాయి. అనేక ప్రాంతాల్లో రేకులు లేచిపోయాయి. కౌటాల మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మామిడి కాయలు నేలరాలాయి. పెంచికల్‌పేట్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఇండ్లపై పడగా తీవ్ర నష్టం వాటిల్లింది. పెంచికల్‌పేట్-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపైన చెట్లు విరిగిపడగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చేతికి వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. దహెగాం మండల కేంద్రంతోపాటు లగ్గాం, మర్రిపల్లి, కమ్మర్‌పల్లి తదితర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంలోని రైస్‌మిల్లు వద్ద రోడ్డుపై చెట్టు విరిగిపడింది. దీంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోతకు వచ్చిన వరి నేలకొరిగింది. రాళ్లవానకు కోతకు వచ్చిన వరికి తీవ్ర నష్టం వాటిల్లింది. కల్లాల్లోని ధాన్యం కుప్పలు తడిశాయి. గాలివానకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రంతా మండలం అంధకారంలోనే ఉంది. తెల్లవారు జామున విద్యుత్‌ను పునరుద్ధరించారు. కాగజ్‌నగర్ మండలం సారసాల, రాస్పెల్లి, గజ్జిగూడ, ఆరెగూడ, మోసం, సీతానగర్ తదితర గ్రామాల్లో గాలివాన కురిసింది. రాస్పెల్లిలో పత్తి గడ్డలు కొట్టుకుపోయాయి. రాస్పెల్లి, గజ్జిగూడ, సితారనగర్, సారసాల, నాగంపేట, విలేజ్ నంబర్-7, 8, జంబుగ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పెంచికల్‌పేట-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై గజ్జిగూడ వద్ద చెట్టు పడిపోగా రాకపోకలకు అంతరాయమేర్పడింది. పలుచోట్ల ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. గజ్జిగూడ ప్రాంతంలో విద్యుత్ మెయిన్ లైన్ పడిపోగా పెంచికల్‌పేట్, దహెగాం మండలాలకు కరెంట్ సరఫరా నిలిచింది. కాగజ్‌నగర్ డీఈఈ కేవీ రాజశేఖర్, కాగజ్‌నగర్ ఏడీఈ శ్రీనివాస్, కౌటాల ఏడీఈ రాజేశ్వర్, సిర్పూర్ (టీ) ఏఈ ఇమ్రాన్, దహెగాం ఏఈ రవీందర్, కాగజ్‌నగర్ రూరల్ ఏఈ జగన్మోహన్ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. నజ్రూల్‌నగర్ విలేజ్-7లోని అమిత్‌దాస్ కోళ్లఫాంలో సుమారు 2వేల కోళ్లు మృతి చెందగా సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లింది.



కెరమెరి: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో నిలిచిన నీరు



పెంచికల్‌పేట్: దరోగపల్లిలో లేచిపోయిన ఇంటి పైకప్పు

ఎంఎస్పీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేశవ్‌రావ్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఎంఎస్పీ బలోపేతానికి కృషి చేయాలని ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ రేగుంట కేశవ్‌రావ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాజన సోషలిస్ట్ పార్టీ, అనుబంధ సంఘాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న 50 రోజుల్లో గ్రామ కమిటీలు పూర్తి చేయాలని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ, రాజ్యాధికార సాధనకు ఉద్యమించాల్సిన అవసరముందని తెలిపారు. 50రోజుల అనంతరం వర్గీకరణ కోసం పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వర్గీకరణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రామాశోక్, నాయకులు శేఖర్, ప్రసాద్, వెంకటేశ్, శంకర్, విష్ణు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఆసిఫాబాద్అర్బన్: సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో సంస్కరణలు అమలు చేయడాన్ని కార్మిక సంఘాలు ప్రతిఘటించకుండా ఉండేందుకు కార్మిక సంఘాలపై ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు. యాజమాన్యాలు కనీసం వినతిపత్రాలు కూడా తీసుకోవడం లేదని తెలిపారు. సంస్థలో రోజురోజుకూ సర్వీసులు తగ్గిస్తున్నారని, గడిచిన మూడేళ్లలో ఏడు వేల మందికి పైగా కార్మికులు తగ్గిపోయారని పేర్కొన్నారు. కానీ, ఆర్టీసీని నడుపుతున్న కిలో మీటర్లు మాత్రం డబుల్‌కు పెంచారని తెలిపారు. ప్రస్తుతం 100 రోజుల చాలెంజ్ పేరుతో మరో లక్ష కిలో మీటర్ల భారాన్ని కార్మికులపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీసం సెలవు కూడా మంజూరు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆర్టీసీలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ఆరోపించారు. ఎనిమిది గంటలకు బదులు 16, 18 గంటల పని చేయిస్తున్నారని తెలిపారు. మస్టర్లను కుదిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సీఐటీయూ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. నాయకులు రాజేందర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు బసవేశ్వరుడి కృషి

ఆసిఫాబాద్అర్బన్: కుల, వర్ణ, జాతి, లింగ, మత వివక్ష లేని సమసమాజ స్థాపనకు నిరంతరం కృషి చేసిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడు అని కలెక్టర్ బొర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ పేర్కొన్నారు. ఆదివారం బసవేశ్వరుడి జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంత్యుత్సవానికి అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి హాజరయ్యారు. బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సమానత్వం కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడు అని కొనియాడారు. జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. బసవేశ్వరుడి ఆశయాలను కొనసాగించాలని సూచించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ అధికారి సజీవన్, ఎంపీపీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సార్ దిద్దిన సర్కారు బడి

ఆయనో ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తాను పని చేస్తున్న పాఠశాల బాగుకోసం నిత్యం పరితపిస్తుంటారు. బోధనతోపాటు పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నారు. ఆయన సేవలు గుర్తించి కేంద్ర ప్రభుత్వం 2021లో జాతీయ ఉత్తమ అవార్డుతో సత్కరించింది. కార్పొరేట్ పాఠశాలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యనందిస్తున్న ఈ బడి వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ ఏ దేవసేన హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న రంగయ్య మాస్టారుపై ప్రత్యేకకథనం..

- అభివృద్ధి బాటలో సావర్‌కెడా పీఎస్
- సొంత ఖర్చుతో ప్రొజెక్టర్ కొనుగోలు
- డిజిటల్ తరగతులతో విద్యాబోధన
- రంగయ్య సేవలు గుర్తించిన కేంద్రం
- ఉత్తమ టీచర్ అవార్డుతో సత్కారం
- నేడు పాఠశాల వార్షికోత్సవం
- హాజరుకానున్న ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యాశాఖ కమిషనర్, ఎస్‌పీడీ



సావర్‌కెడా పాఠశాల



విద్యార్థులకు బోధిస్తున్న రంగయ్య (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సావర్‌కెడా పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి ఐదో వరగతి వరకు 151 మంది విద్యార్థులు చదువుతున్నారు. 4.11.2010న ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా చేరిన కడెర్ల రంగయ్య అప్పుడే ఆ బడిని తీర్చిదిద్దాలనుకున్నారు. 48 మంది విద్యార్థులుండగా ఆ సంఖ్యను 151కి పెంచారు. ప్రస్తుతం ముగ్గురు రెగ్యులర్ ఉపాధ్యాయులతోపాటు నలుగురు విద్యావలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే పాఠశాలలో హెచ్ఎం రంగయ్య సతీమణి వీణ పదేళ్లుగా ఉచిత బోధన చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

దాతల ప్రోత్సాహం మెండు
విద్యార్థుల తల్లిదండ్రులు, దాతల ప్రోత్సాహంతో పాఠశాల అభివృద్ధిలో దూసుకెళ్తోంది. ఇప్పటివరకు విద్యార్థుల తల్లిదండ్రులు, దాతల నుంచి రెండేళ్లలో రూ.10 లక్షలు విరాళంగా సేకరించి అనేక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యావలంటీర్లు కూడా రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఈ విరాళాలతో వాటర్‌ట్యాంకులు నిర్మించి నల్లాలు బిగించారు. ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. ఇక్కడ చదివిన 120మంది విద్యార్థులు వివిధ గురుకులాల్లో ప్రవేశం పొందగా.. తొమ్మిది మంది హైదరాబాద్‌లోని చుక్కా రామయ్య ట్రస్ట్‌లో సీటు సంపాదించారు.

ప్రొజెక్టర్ ద్వారా తరగతుల నిర్వహణ
ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారు. దీంతో ప్రైవేట్‌కు వెళ్లేవారు కూడా సావర్‌కెడా పాఠశాలలో చేరుతున్నారు. విశాలమైన ప్రాంగణం, ప్రహరీ, గోడలపై రంగురంగుల బొమ్మలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. తరగతి గదుల్లోనూ ఎక్కాలు, పద్యాలు, జాతీయ నాయకులు చిత్రాలు, జంతువుల బొమ్మలు ముచ్చటగొలుపుతున్నాయి.

'సార్' మెచ్చిన బడి
మారుమూల గ్రామమైన సావర్‌కెడా గురించి నేడు రాష్ట్రంలో తెలియని వారుండరు.. ఎన్నో ప్రచార మాధ్యమాల ద్వారా బడి గురించి తెలుసుకున్న కొందరు విరాళాలు అందించారు. 'సార్' దర్శకుడు అట్లూరి వెంకి ప్రత్యేకంగా రంగయ్య మాస్టారును హైదరాబాద్‌కు పిలిపించి పాఠశాల వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల, గ్రంథాలయ అభివృద్ధికి రూ.3లక్షలు విరాళంగా అందించారు. కాగా, వచ్చిన విరాళాలను సావర్‌కెడా పాఠశాలతోపాటు జిల్లాలోని ఇతర పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు వినియోగిస్తున్నారు. అలాగే ఆ పాఠశాలలో 'మన ఊరు–మన బడి' పనులూ కొసాగుతున్నాయి. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి.

నేడు పాఠశాల వార్షికోత్సవం
సోమవారం సావర్‌కెడా పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, పాఠశాల అభివృద్ధికి రంగయ్య అందిస్తున్న సేవలు, విద్యార్థుల అభ్యున్నతి, ఉపాధ్యాయుల పనితీరు తెలుసుకోవడంతోపాటు వార్షికోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, కమిషనర్, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ దేవసేన ఇక్కడకు వస్తున్నారు.

పాఠశాల ప్రత్యేకతలివే..
- నర్సరీ నుంచి డిజిటల్ తరగతులు
- విద్యార్థులకు ప్రత్యేక బెంచీలు
- ప్రింటర్‌తో ప్రశ్న పత్రాల తయారీ
- ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ
- పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం
- 4నుంచి డిగ్రీ వరకు క్విజ్ నిర్వహణ
- లెర్నింగ్ మెటీరియల్ అందించడం
- క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంచడం
- గ్రంథాలయాన్ని విద్యార్థులే నిర్వహించడం

బోధన చాలా బాగుంది



ఇక్కడి బోధన చాలా బాగుంది. ఉపాధ్యాయులు చాలా కష్టపడుతున్నారు. ఈ కాలంలో కూడా ఇంత నిబద్ధతతో పని చేసే టీచర్లు లభించడం మా అదృష్టం. రాత్రి, పగలు చాలా కష్టపడుతున్నారు. ప్రభుత్వం అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు మంజూరు చేయాలి.
– మహేందోరే నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్, సావర్‌కెడా

ఉన్నత పాఠశాలగా ఎదగాలని..



పాఠశాలలో ప్రస్తుతం ఐదోతరగతి వరకే బోధిస్తున్నాం. భవిష్యత్‌లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కావాలని కోరుకుంటున్నాం. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి తమ లక్ష్యాలను సాధించాలి. గ్రామస్తులు, అధికారుల ప్రోత్సాహంతోనే ఇంత అభివృద్ధి సాధించగలుగుతున్నాం.
– కడెర్ల రంగయ్య, హెచ్ఎం, సావర్‌కెడా

క్లుప్తంగా

గుండెపోటుతో మాజీ ఉప సర్పంచ్ మృతి

శ్రీరాంపూర్: సింగపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ సిద్దం శంకర్ (60) గుండె పోటుతో మృతి చెందాడు. అరుణక్కనగర్‌కు చెందిన శంకర్ శనివారం మధ్యాహ్నం అస్వస్తతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గుండె పోటుగా అనుమానించి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స మొదలు పెట్టే సయమానికే గుండెపోటుతో మృతి చెందాడు. శంకర్ సింగరేణి కార్మికుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. ఇతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు.

యువకుడి మృతి


నరేశ్ మృతదేహం

ఆసిఫాబాద్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన జంపాల నరేశ్ (35) ఆదివారం ఉదయం ఆకస్మాత్తుగా కిందపడి మృతి చెందాడు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నరేశ్ తిరిగి వచ్చి ఇంటి ఎదుట ఆకస్మాత్తుగా పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న జంపాల సుభాష్ ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


చిందరవందరగా పడిపోయిన సామగ్రి

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామ సమీపంలోని నజీర్‌పల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన అంజి ఇంటి సామగ్రిని ట్రాలీలో నింపుకుని మంచిర్యాల వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ట్రాలీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ట్రాలీలోని సామగ్రి చిందరవందగా పడిపోగా అంజితో పాటు మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో మంచిర్యాల ప్రభుత్వసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భాగ్యనగర్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన కీర్తి నర్సింగ్ శుభకార్యంలో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొన్నారి గ్రామానికి వెళ్లారు. ఆదివారం ఉదయం 10.30 ప్రాంతంలో నర్సింగ్ కుమారుడు దుస్తుల కోసం ఇంటికి వచ్చాడు. తాళం పగలగొట్టి ఉండటం గమనించి కుటుంబీకులకు సమాచారం అందించాడు. వారు అక్కడి చేరుకున్నారు. ఇంట్లోని 15 గ్రాముల బంగారం, 7 తులాల వెండి, టీవీ, హోంథియేటర్, సెటాప్ బాక్స్, రూ.వెయ్యి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు టుటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కృత్రిమ పిట్ట గూళ్లు


డివిజన్ కార్యాలయం కట్టిన కృత్రిమ పిట్టగూడు


నూతనంగా తయారు చేసిన పిట్టగూడు

వేసవిలో ఎండలు ఎక్కువ కావడంతో పక్షులు నీటి కోసం, ఆహారం కోసం, గూడు కోసం అల్లాడుతాయి. వాటికి ఉపశమనం కలిగించేందుకు అటవీశాఖ అధికారులు నూతన విధానం ఏర్పాటు చేశారు. కూడు, గూడు, ఆవాసం అందే విధంగా జంతువులతో పాటు పక్షులకు కూడా కృత్రిమ గూళ్లను తయారు చేశారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో ఎఫ్‌డీవో మాధవరావు ఆదేశాల ప్రకారం బీట్ అధికారులు కృత్రిమ గూళ్లను తయారు చేసి అడవిలో పచ్చని చెట్లకు అమర్చారు. గూళ్లతో పాటు నీటి సౌకర్యం కలిగించే విధంగా చిప్పలను ఉంచి వాటిలో నీరు పోస్తున్నారు. జన్నారం అటవి డివిజన్‌లో ప్రతి బీట్‌లో పది నుంచి 15 వరకు కృత్రిమ పిట్టగూళ్లను ఏర్పాటు చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు. – జన్నారం


అడవిలో చెట్టుకు కట్టిన కృత్రిమ పిట్టగూళ్లు

గుడుంబా మత్తు

ఈ నెల 9న వేమనపెల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గుడుంబా అమ్మవద్దని దుర్గం శివరాం విక్రయదారుడిని ప్రశ్నించాడు. దీంతో శివరాంపై విక్రయదారుడు దాడి చేయడంతో పాటు అధికారులందరికీ మాముళ్లు ఇస్తున్న.. నీ దిక్కున్న చోట చెప్పుకోమని బహిరంగంగా హెచ్చరించాడు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు చెబితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని చెప్పడం గమనార్హం. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఏదో ఒక చోట చోటుచేసుకుంటున్నానే ఉన్నాయి. అధికారులు నామమాత్రంగా దాడులు చేయడం మినహా పూర్తిస్థాయి నివారణకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- జిల్లాలో విచ్చలవిడిగి తయారీ
- నాటుసారా తయారీ కేంద్రంగా అటవీ ప్రాంతం
- మహారాష్ట్ర నుంచి ముడిసరుకు దిగుమతి
- 'మాములు'గా తీసుకుంటున్న అధికారులు
- తయారీ, విక్రయదారులకు పునరావాసం కల్పించినా ఫలితం శూన్యం


విక్రయదారులను పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది (ఫైల్)

జిల్లాలో రెండు సంవత్సరాల్లో నమోదైన కేసులు...

ఏడాది	కేసులు	అరెస్ట్	పట్టుకున్న గుడుంబా
2021	516	121	568 లీటర్లు
2022	415	373	1897 లీటర్లు
2023(మార్చి)	112	114	532 లీటర్లు



మంచిర్యాలక్రైం: గుడుంబా పచ్చని కుటుంబాల్లో విషాదం నింపుతోంది. తాగుడుకు బానిసై పలువురు యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు మద్యం మత్తులో హత్యలకు తెగపడుతున్నారు. మరెందరో అనారోగ్యానికి గురై మృత్యువుకు దగ్గరవుతున్నారు. గుడుంబాను అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం కానరావడం లేదు. దీంతో గుడుంబాకు బానిసై అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కొందరు అక్రమార్కులు దీనిని సొమ్ము చేసుకుంటున్నారు. తయారీకి గ్రామ సరిహద్దు గ్రామాలను అడ్డాలుగా ఎంచుకుంటున్నారు.

ప్రాణహిత సరిహద్దు గ్రామాల్లో...

మంచిర్యాల జిల్లాలో అధికంగా ప్రాణహిత సరిహద్దు గ్రామాల్లో గుడుంబా తయారు చేస్తున్నారు. ప్రధానంగా అటవీ సమీపంలోని ఆల్గామా, దేవులవాడ, వెలుమపల్లి, మల్లంపేట, కోటపల్లి, వెంచపల్లి, సిర్సా, అన్నారం, అర్జునగుట్టా, జన్నారం, బీమారం, శివ్వారం, నెన్నెల అటవీ ప్రాంతాలు గుడుంబా తయారీకి అనువుగా మారాయి. అడవుల్లో బట్టీలు ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా తయారు చేసి విక్రయిస్తున్నారు. దీనికి ముడిసరుకు మహారాష్ట్ర నుంచి సరఫరా అవుతున్నట్లు సమాచారం.

అడవిలోనే మకాం...

నాటుసారా చేసేందుకు వ్యాపారులు అడవుల్లోనే రోజుల తరబడి మకాం వేస్తున్నారు. సార తయారీకి అవసరమైన ముడిసరుకు తుమ్మ చెక్క, బెల్లం, యూరియా, పటిక బెల్లం చేరవేస్తున్నారు. వారికి అవసరమైన ఆహార పదార్థాలను వెంట తీసుకెళ్తూ అక్కడే ఉంటున్నారు. నాటుసారా తయారీకి ముడిసరుకు, ఆహార పదార్థాలను తరలించేందుకు కూలీలను పెట్టుకుంటున్నారు. వీరికి రోజుకు రూ.5వందలు చెల్లిస్తున్నట్లు సమాచారం.

ఫలించని పునరావాస వ్యూహం...

నాటుసారా నియంత్రణకు ప్రభుత్వం సారా విక్రయదారులను, తయారీదారులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టింది. పునరావాసం కింద రూ.2లక్షల విలువైన వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు ఆర్థిక సాయం అందజేసింది. జిల్లాలో 211మంది గుర్తించి 210 మందికి పూర్తి స్థాయిలో పునరావాస ప్యాకేజీని 2017లో అందించింది. ఇటీవల మళ్లీ గుడుంబా విక్రయాల వైపు మొగ్గుచూపుతున్నారు.


గుడుంబా తయారీదారులు దిగుమతి చేసుకున్న ముడిసరుకు

సమాచారం అందించి సహకరించాలి

సారా బట్టీలపై నిరంతరం దాడులు చేస్తున్నాం. జిల్లాలో ప్రత్యేక టీమ్ ద్వారా తనిఖీలు చేపడుతున్నాం. గుడుంబా తయారీ, విక్రయాలపై సమాచారం అందించి సహకరించాలి. గుడుంబా నిర్మూలనకు అందరూ కృషి చేయాలి. ముడిసరుకు విక్రయాదారులపై చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. – కేజీ. నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, మంచిర్యాల

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

- ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి


డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణ ఇస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా డ్రైవర్లు కండక్టర్లు కృషి చేయాలని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు ఇస్తున్న ట్యాక్ట్ (టీఎస్ ఆర్టీసీ ఏప్రిల్ ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్)లో ఆదివారం పాల్గొని పలు అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి చేరువ కావాలన్నారు. వారితో మమేకమవుతూ వారికి మెరుగైన సేవలందించడానికి పాటుపడాలన్నారు. ప్రొజెక్టర్ ద్వారా వృత్తి నైపుణ్యాలు, ఇతర అంశాలపై శిక్షణ అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామంలో సత్యనారాయణ ఇంట్లో శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాలు.. సత్యనారాయణ ఇంట్లోని కూలర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. కుటుంబీకులు కేకలు వేయడంతో చుట్టూపక్కల వారు వచ్చి మంటలారిప్పేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, వంట సామగ్రి, ఫర్నిచర్ సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.

అన్ని రకాల వ్యాధులకు హోమియో వైద్యం



సెమినార్‌లో పాల్గొన్న వైద్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలటౌన్: రానున్న రోజుల్లో హోమియోపతిక్ వైద్యం ఎంతో కీలకంగా మారనుందని పలువురు వైద్యులు తీర్మానం చేశారు. ఆదివారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని హోమియోపతిక్ ఫిజిషియన్స్ అసోసియేషన్ భవన్‌లో హోమియో పితామహుడు డాక్టర్ హనిమెన్ జయంతి వేడుకలతో పాటు హోమియోపతిక్ సైంటిఫిక్ రాష్ట్ర సెమినార్‌ను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన హోమియో ప్రత్యేక సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ గణేశ్ ఆచార్యలు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల గుర్తించడంతో పాటు వ్యాధి నివారణకు చేపట్టాల్సిన వివరాలను సెమినార్‌లో తెలియజేశారు. హోమియో వైద్యంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం లభిస్తుందని తెలిపారు. వైద్య వృత్తిలో కొత్త మెళుకువలతో పాటు రోగులకు అధునాతన వైద్యం అందించడానికి సెమినార్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. సెమినార్‌లో రాష్ట్ర హోమియోపతిక్ ఫిజిషియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ స్వామి, డాక్టర్ రాజు, మంచిర్యాల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కిరణ్, డాక్టర్ నాగేంద్ర ఉపాధ్యాయ, కోశాధికారి డాక్టర్ గౌరీశంకర్, వైద్యులు సుగుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఇక్బాల్, సలీం, ముంతాజ్, ప్రవీణ్‌రెడ్డి, సునీల్, క్రిష్ణ, నాగేందర్, నవీణ్, శోభారాణి పాల్గొన్నారు.

ఒకే క్షేత్రం.. పంటలు అనేకం


సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోట

- మామిడి, ఆయిల్ పామ్, సపోటా, మల్బరి
- చేపలు, నర్సరీల పెంపకం
- సేంద్రియ ఎరువుల వాడకం
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు మధు


చేపలకు ఆహారం అందిస్తున్న రైతు


మామిడితోటలో అంతర పంట మల్బరి

చెన్నూర్‌రూరల్: అదో వ్యవసాయక్షేత్రం.. అందులోకి వెళ్తే పలు రకాల పంటల సాగు, ఆ క్షేత్రం చుట్టూ టేకు మొక్కలు, మల్బరి, వేప మొక్కలను పెంచుతున్నాడు. 2008లో మామిడి మొక్కలతో ప్రారంభించిన వ్యవసాయ క్షేత్రం ఆ రైతుకు ఉపాధిని ఇస్తుంది. చెన్నూర్ పట్టణానికి చెందిన మద్ద మధు అనే రైతుకు మండలంలోని లంబడిపల్లిలో సుమారు ఎడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో మూడెకరాల్లో మామిడి చెట్లు, రెండెకరాల్లో ఆయిల్‌పామ్, అరెకరంలో చేపల పెంపకం, మరో ఎకరంన్నరలో సపోటా, ఎర్ర చందనం, కంకవనం, సీతాఫలం, ఇతర మొక్కలు పెంచుతున్నాడు. ఆయిల్ పామ్‌లో అంతర పంటగా మలబారీ మొక్కలు పెంచుతున్నాడు. అక్కడే అయిదు గుంటల స్థలంలో షెడ్డు నిర్మాణం చేసి పట్టు పురుగులను పెంచుతున్నాడు. వ్యవసాయ క్షేత్రం చుట్టూ సుమారు వెయ్యి టేకు మొక్కలు, అంతర పంటలుగా మినుములు, కూరగాయలు సాగు చేస్తున్నాడు. కంపోస్టు ఫిట్‌ను ఏర్పాటు చేసి అందులో ఆకులు, ఇతర వ్యర్థాలను వేసి సేంద్రియ ఎరువును తయారు చేసి పంటలకు అందిస్తున్నాడు. వ్యవసాయ, పట్టు పరిశ్రమల శాఖల అధికారుల సలహాలు తీసుకుంటూ ముందుకెళ్తున్నాడు.

ప్రశాంతంగా టీజీ సెట్


పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్) -2023 ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్‌లో ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణ కోసం రీజియన్ పరిధిలో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8,075 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 7,627 మంది హాజరయ్యారు. 448 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో 94.45 శాతం విద్యార్థుల హాజరు శాతం నమోదైనట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,397 మందికి 2,238 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 8 పరీక్ష కేంద్రాల్లో 2,603 మంది విద్యార్థులకు 2,467 మంది పరీక్షకు హాజరయ్యారు. అదే తీరుగా మంచిర్యాల జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఉండగా వీటిలో 3,075 మంది విద్యార్థులకు 2,922 మంది పరీక్ష రాశారు. పరీక్ష ఉదయం 11గంటలకు ఉండగా విద్యార్థులు ముందస్తుగా ప్రకటించినట్లుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన ద్వారాల వద్ద విద్యార్థులను నిశితంగా పరీక్షించిన తర్వాత లోనికి పంపించారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కో ఆర్డినేటర్

బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష కేంద్రాలను సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి సందర్శించారు. రాష్ట్రర ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల (టీఎస్ ఆర్ఎస్), సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలతో పాటు సీఓఈ బాలుర కళాశాల పరీక్ష కేంద్రాలకు వెళ్లి విద్యార్థులు రాస్తున్న పరీక్ష తీరును పరిశీలించారు. ఆమె వెంట ఆయా పరీక్ష కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, బి.శ్రీనివాస్, ఊటూరి సంతోష్‌కుమార్, ఎస్.స్వరూప, డిపార్ట్‌మెంటల్ అధికారులు ప్రేమరాణి, తులసి, విశ్వాస్, దేశీపాల్, కవితరాణి ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద తాళ్ల గురిజాల ఎస్సై బందోబస్తును పర్యవేక్షించారు.

పగిలిన తాగునీటి పైపులైన్


పగిలిన పైపుల నుంచి రోడ్డుపైకి వచ్చిన తాగునీరు

మంచిర్యాలటౌన్: రైల్వే ఓవర్‌బ్రిడ్జి నుంచి పాతమంచిర్యాల రాళ్లవాగు వంతెన వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటి పైప్‌లైన్ ఆదివారం సాయంత్రం వైశ్య భవన్ సమీపంలో పగిలిపోయింది. దీంతో నీరంతా రోడ్డుపై చేరింది. సోమవారం ఒడ్డెర కాలనీ, మారుతి నగర్, అంబేద్కర్ నగర్, సుభాష్‌రోడ్డు, గొల్లవాడ, హైటెక్‌సిటీ కాలనీలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ద్యాగవాడ చెందిన బండారి శ్రీను కుమారుడు సత్యవంశీ (19). హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రెండురోజులు సెలవులు ఉండడంతో శుక్రవారం నిర్మల్‌కు వచ్చాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుడితో కలిసి బైక్‌పై బయటకు వెళ్లాడు. బైక్ అదుపుతప్పి మృతిచెందాడు.

'బాల్క సుమన్‌తో ప్రాణహాని'

మందమర్రిరూరల్: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో చెన్నూర్ నియోజకవర్గ ప్రతిపక్ష పార్టీల నాయకులకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వమే రక్షించాలని కోరుతూ మందమర్రిలోని అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్‌టీపీ నాయకులు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కోర్డినేటర్ దుర్గం నగేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రశ్నిస్తే తుపాకీతో కాలుస్తానని ప్రతిపక్ష పార్టీల నాయకులను బెదిరించాడని పేర్కొన్నారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే చేసిన అభివృద్ధి చూపించాలే తప్ప బెదిరించడం ఏమిటని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్, నాయకులు ప్రభుదేవ, రాజేంద్ర ప్రసాద్, సాయికిషోర్, శ్రీనివాస్, అబీద్, సునీత, విజయ ఉన్నారు.


వినతిపత్రం అందించిన వైఎస్సార్‌టీపీ నాయకులు

వృద్ధురాలి ఆత్మహత్య

కడెం: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన ఎనగందుల శంకరవ్వ (60) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాజు కథనం ప్రకారం..శంకరవ్వ గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించుకున్నా ఎంతకీ నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.